
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
బుధవారం 22 మే 2024



ముమ్మరంగా సాగు



అక్కన్నపేట మండలం అంతకపేటలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

- పునాసకు సన్నద్ధం
- మే 25 నుంచి రోహిణి కార్తె ప్రారంభం
- విత్తనాలు నాటేందుకు దుక్కులు దున్నుతున్న అన్నదాతలు
- ఆరుతడి పంటలపై ఆసక్తి.. ఎరువులను సిద్ధం చేసుకుంటున్న రైతులు

అక్కన్నపేట/గజ్వేల్ మే 21: వానాకాలం ప్రారంభమవుతుండడంతో రైతులు పునాస సాగుకు అన్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురుస్తుండడంతో రైతులు దుక్కులు దున్నుతున్నారు. కొందరు రైతులు కృత్తిక కార్తె విత్తనాలు వేశారు. ఈ సమయంలో విత్తనాలు వేస్తే వచ్చే వానాకాలంలో పంట ముందే చేతికొస్తుంది. అలాగే రెండో పంట సాగు చేసుకోవచ్చని కూడా కొందరు ముందే విత్తనాలు వేసేందుకు ఆసక్తి చూపుతారు. అలాగే మే 25 నుంచి రోహిణి కార్తె ప్రారంభం కానున్న నేపథ్యంలో విత్తనాలు వేస్తే పంటలకు ఎలాంటి చీడపీడలు రాకుండా పంట దిగుబడి ఎక్కువ వస్తుందని రైతుల నమ్మకం. జిల్లాలో వరి పంటతో సాగు పత్తి, మొక్కజొన్న, కంది పంటలను వేస్తారు. జిల్లాలో సుమారు మూడు లక్షలకు పైగా ఎకరాల్లో పత్తిసాగయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం పత్తి, మొక్కజొన్న సాగు పంటల కోసం రైతులు భూమిని చదును చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లాలో ముందస్తుగా వర్షాలు కురవడంతో అన్ని గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పత్తి కట్టె తీసి కాల్చడం, భూమిలో కోడెరువు చల్లుకోవడం, ట్రాక్టర్లతో భూమిని చదును చేసుకునే పనులు





జోరందుకున్నాయి. భూమి దున్నడానికి అనువైన సమయం కావడం వల్ల రైతులు ట్రాక్టర్లతో, ఎడ్లతో గొర్రు దున్నే పనులు చేపడుతున్నారు. ఉదయం, సాయంత్రం రైతులు పొలం పనుల్లో నిమగ్నమై వ్యవసాయ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

ఆరుతడి పంటలపై ఆసక్తి

హుస్నాబాద్ డివిజన్‌లోని అక్కన్నపేట, కోహెడ, హుస్నాబాద్, బెజ్జంకి మండలాల్లో ఎక్కువగా రైతులు ఆరుతడి పంటల సాగుపై ఆసక్తి చూపుతారు. మొక్కజొన్న, కంది, పచ్చజొన్న, నువ్వులు, బబ్బర, పెసరుతో పాటు ఇతర ఆరుతడి పంటలు సాగు చేస్తారు. వానాకాలం ప్రారంభం ముందే విత్తనాలు వేస్తే వారం, పది రోజులకు ఒకసారి వర్షం పడిన పంట చేతికి వస్తుంది. అక్కన్నపేట మండలంలో 80 వరకు గిరిజన తండాలు ఉండడం వారు ఎక్కువగా జొన్న రొట్టెలు తినేందుకు ఇష్టపడుతుండడంతో పచ్చజొన్నలు ఈ తండాల్లో అధికంగా పండిస్తారు.

మక్క ఎక్కువగా సాగు చేస్తాం



- ఏలేటి రాజిరెడ్డి, రైతు, కుందనవానిపల్లి

వానాకాలంలో మొక్కజొన్న పంటను ఎక్కువగా సాగు చేస్తాం. పంట వేశాక మూడు నెలలకే చేతికొస్తుంది. మక్క తర్వాత వరి సాగుచేస్తాం. తక్కువ పెట్టుబడితో పాటు పశువులకు మొక్కజొన్న చొప్ప గ్రాసంగా ఉపయోగపడుతుంది.

పచ్చ జొన్నలు పండిస్తాం..



- సునావత్ మోహన్‌నాయక్, రైతు, మంజ్యానాయక్ తండా

గిరిజనులు ఎక్కువగా జొన్న రొట్టె తింటారు కాబట్టి తండాల్లో అధికంగా పచ్చ జొన్నలు పండిస్తాం. జొన్నలకు మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. క్వింటాల్ రూ. 12వేల నుండి రూ.15వేల వరకు ధర పలుకుతుంది. మూడు నెలలకే పంట చేతికి వచ్చిన తర్వాత వరి పంట సాగు చేస్తాం.

రోహిణి కార్తెలో విత్తనాలు వేస్తాం..



- కామాద్రి విక్షపతి, రైతు, అంతకపేట

పునాస పంట సాగు చేయడానికి రోహిణి కార్తెలో విత్తనాలు వేస్తాం. ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయి. కానీ రోహిణి కార్తెలో విత్తనాలు విత్తితే పంటలు బాగా పండుతాయి. పెసర, కంది పంటలు వేస్తాం. 90 రోజుల్లోనే పంట వచ్చిన తర్వాత వరి సాగు చేస్తాం.

దేశం కోసం ప్రాణాలర్పించిన
మహనీయుడు రాజీవ్

- అమెరికాలో రాజీవ్ వర్ధంతిలో మంత్రి పొన్నం



అమెరికాలోని న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ వద్ద రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, మే 21: దేశ ఐక్యత కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కొనియాడారు. అమెరికాలోని న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ వద్ద మంగళవారం నిర్వహించిన మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ దేశాన్ని సాంకేతిక రంగంలో అగ్రగామిగా నిలిపారని, 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించి యువతను భారత దేశ నిర్మాణంలో భాగస్వామ్యం చేశారన్నారు. రాజీవ్ చూపిన మార్గంలో యువత నడువాలని కోరారు.



దుబ్బాక మండలం హబ్షీపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మాట్లాడుతున్న భారతి హోళికేరి

తడిసిన ధాన్యాన్ని
కొనుగోలు చేస్తాం

- రైతులు ఆందోళన చెందొద్దు
- ఆర్కియాలజీశాఖ కమిషనర్, మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతిహోళికేరి

7లో

ఆధునిక పరిజ్ఞానంతో
పండ్లను సాగు చేయాలి

- కొండా లక్ష్మణ్ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డి.నీరజాప్రభాకర్

7



హుస్నాబాద్ పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

హుస్నాబాద్, మే 21 : హుస్నాబాద్‌లో మంగళవారం హనుమాన్ మాలధారులు ఆంజనేయస్వామి శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. అంజనేయస్వామి భారీ విగ్రహంతో పట్టణంలోని పురవీధుల గుండా భజనలు, కీర్తనల నడుమ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది హనుమాన్ మాలధారులు పాల్గొన్నారు.

ఠాణా ఎదుట ఎస్ఐ భార్య ఆందోళన

- రెండో పెళ్లి చేసుకుని.. తమకు అన్యాయం చేస్తున్నాడని..
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపణ

చేర్యాల, మే 21 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు తనకు తెలియకుండా రెండో వివాహం చేసుకున్నాడని, పిల్లలను బలవంతంగా తీసుకెళ్లాడని అతడి మొదటి భార్య మానస మంగళవారం సాయంత్రం కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట తల్లి, బంధువులతో కలిసి ఆందోళనకు దిగింది. నాగరాజు రెండో భార్య వల్ల తనకు, తన పిల్లలకు ప్రాణహాని ఉందని, పోలీసులు తనకు న్యాయం చేయాలని ఆమె కోరుతోంది. బాధితురాలి కథనం ప్రకారం..

కరీంనగర్ జిల్లా గోపాలపురానికి చెందిన మానసకు కొమురవెల్లి ఎస్ఐ నాగరాజుతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులున్నారు. సుమారు రెండేళ్ల క్రితం ఎస్ఐ నాగరాజు మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని మానసను వేధిస్తున్నాడు. కొంతకాలం క్రితం మానసను, పిల్లలను కరీంనగర్‌లో ఉంచాడు. అప్పుడప్పుడు అక్కడికి వచ్చిపోయేవాడు. వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడు. రెండు నెలల క్రితం బలవంతంగా పిల్లలను తీసుకెళ్లి.. వాళ్లు ఎక్కడున్నారో మానసకు చెప్పడం లేదు. అలాగే, విడాకులు ఇవ్వాలని వేధించడంతో



కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్ఐ నాగరాజు మొదటి భార్య మానస, ఆమె కుటుంబీకులు



ఎస్ఐ నాగరాజు, మొదటి భార్య మానస

మానస ఆత్మహత్యాయత్నం చేసుకుంటానని ఆమె సూసైడ్ నోట్ రాసింది. కుటుంబ సభ్యులు కలగ జేసుకుని న్యాయం చేస్తామని చెప్పడంతో విరమించుకుంది. ఈ విషయాన్ని సిద్దిపేట సీపీ, చేర్యాల సీఐ, కరీంనగర్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని బాధితురాలు వాపోయింది. తనకు, తన ఇద్దరు పిల్లలకు ఎస్ఐ నాగరాజు, రెండో భార్యతో ప్రాణహాని ఉందని, నాగరాజు.. పిల్లలు తనతో కలిసి ఉండేలా న్యాయం చేయాలని ఆమె మంగళవారం కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగింది. అయితే, ఎస్ఐ నాగరాజు సెలవులో ఉన్నారని సిబ్బంది చెప్పారు. తనకు న్యాయం జరిగేంత వరకు ఆందోళన చేస్తానని ఆమె పేర్కొంది. ఈ విషయమై సీఐ శ్రీనును సంప్రదించగా, విషయాన్ని మానస ఇటీవల తమ దృష్టికి తీసుకువచ్చారని.. కౌన్సెలింగ్ ఇచ్చామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సంగారెడ్డి జిల్లాలో
మరో రెండు కేజీబీవీలు

సంగారెడ్డి అర్బన్, మే 21 : సంగారెడ్డి జిల్లాకు మరో రెండు కస్తూర్బా గాంధీ విద్యాలయ్యాలు (కేజీబీవీలు) మంజూరయ్యాయి. నాగల్‌గిద్ద, వట్‌పల్లిలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. నాగల్‌గిద్దకు మంజూరైన కేజీబీవీని నారాయణఖేడ్‌లో, వట్‌పల్లికి మంజూరైన కేజీబీవీని అందోల్‌లో కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు. 40 సీట్ల చొప్పున 6, 7 తరగతులతో ప్రవేశాలు కల్పించనున్నారు. సిబ్బందిని ఎన్నికలకోడ్ ముగిసిన తర్వాత భర్తీ చేయనున్నారు. ఈ రెండింటితో కలిపి జిల్లాలో కేజీబీవీల సంఖ్య 22కు చేరింది.

కౌంటింగ్ నిర్వహణలో సూపర్‌వైజర్ల పాత్ర కీలకం

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, మే 21. లోక్‌సభ ఎన్నికల బ్యాలెట్ కౌంటింగ్‌లో ఎలాటి తప్పిదాలు లేకండా సమన్వయంతో విధులు నిర్వహించాలని సూపర్‌వైజర్లు, సూక్ష్మ పరిశీలకులను మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. మెదక్‌లోని కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన ఏఆర్‌వోలు, ఆర్డీవోలు రమాదేవి, శ్రీనివాస్, జైచంద్రారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డితో కలిసి సూపర్‌వైజర్లు, సూక్ష్మ పరిశీలకుల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనరల్ కౌంటింగ్ నిర్వహణలో మెదక్ నియోజకవర్గానికి 20 రౌండ్లు, నర్సాపూర్ నియోజకవర్గానికి 22 రౌండ్లలో కౌంటింగ్ చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రతీ రౌండ్ 14 టేబుళ్లు ఏర్పాటు చేసి 14 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి లెక్కిస్తారని తెలిపారు. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో ఒక రౌండ్‌కు 119 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి లెక్కింపు జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులవారీగా పోలైన ఓట్లు, కౌంటింగ్ ప్రక్రియ తప్పనిసరిగా అభ్యర్థులకు కనబడేలా ఉంచాలని చెప్పారు. కౌంటింగ్ అబ్జర్వర్ పరిశీలన చేసినప్పుడు ఎటువంటి పొరపాట్లకు తావివ్వరాదని హెచ్చరించారు.



మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

బడుల బాధ్యత 'అమ్మ'లదే

- వారి ఆధ్వర్యంలోనే వసతుల కల్పన
- మరో 20 రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం
- ఈ లోపే పనులు పూర్తిచేసేలా చర్యలు

కొండపాక, మే 21 : నూతన విద్యా సంవత్సరంలో పాఠశాలలు మరో 20 రోజుల్లో పునఃప్రారంభంకానున్నాయి. అయితే, పాఠశాలల్లోని కనీస వసతులు అన్నింటిని పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా నెల క్రితం పాఠశాలల్లోని కనీస వసతుల వివరాలను సేకరించి నూతనంగా ఏర్పాటైన అమ్మ ఆదర్శ కమిటీల తీర్మానాల మేరకు అబివృద్ధి పనులను నిర్ణయించారు. వాటి పనులను అమ్మ ఆదర్శ కమిటీలే చేయనున్నాయి. అందుకోసం ముందుగా అమ్మ ఆదర్శ కమిటీ బ్యాంకు ఖాతాలో 25 శాతం నిధులను జమ చేశారు. ఆ నిధులతో మంజూరైన పనులను ప్రారంభించి పాఠశాలలు ప్రారంభం అయ్యే నాటికి పూర్తి చేయాల్సి ఉంది. పాఠశాలలోని వివిధ పనుల కోసం కేటాయించిన నిధులను ఉపయోగించి సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల రికార్డుల మేరకు ఖర్చు చేయాల్సి ఉంది.

సిద్దిపేట జిల్లాలోని 814 ప్రభుత్వ పాఠశాలలకు రూ.34.81కోట్లు మంజూరయ్యాయి. వీటి ద్వారా అయా పాఠశాలల్లో మొదట పనులను నిర్వహిస్తారు. గత ప్రభుత్వం పాలనలో పాఠశాల అభివృద్ధి కోసం మన ఊరు మనబడి పేరున మూడు విడతలుగా విభజించారు. మొదటి విడత పనులు కొన్ని గ్రామాల్లోనే పూర్తయ్యాయి. మరికొన్ని చోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. ప్రస్తుతం అలాకాకుండా అన్ని పాఠశాలల్లో వసతులను గుర్తించి అవసరమైన పనులను చేయాలని తీర్మానాలు చేశారు. పాఠశాలల్లో విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం తాగునీటి వసతి, మైనర్ రిపేర్లు, కిటికీలు, తలుపుల మరమ్మతులు లాంటి వాటికి నిధులు మంజూరు అయ్యాయి. వాటిని పాఠశాలల్లో ఖర్చు చేసి పనులు నిర్వహిస్తున్నారు. పనులను సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులతో పాటు విద్యాశాఖ అధికారులు కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. మరో 20 రోజుల్లో పాఠశాలు ప్రారంభంకానుండడంతో పనులను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు.



దుద్దెడ గ్రామ అంబేద్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో టీవీ



పాఠశాలలు తెరిచే నాటికి పూర్తవ్వాలి

- తెలంగాణ సమగ్ర శిక్ష అదనపు సంచాలకుడు గాజర్ల రమేష్

పాఠశాలలు తెరిచే నాటికి పనులు పూర్తిచేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష అదనపు సంచాలకులు గాజర్ల రమేష్ సూచించారు. అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో కొండపాక మండలంలోని సిరసనగండ్ల ఉన్నత పాఠశాల, కొండపాక ఉన్నత పాఠశాలలో చేపట్టిన పనులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విఠల్, పలువురు ఉన్నారు.



సిరిసినగండ్ల పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న అధికారులు

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



లక్ష్మీనృసింహస్వామి ఆలయ మండపంలో కుంకుమార్చన చేస్తున్న భక్తులు

వర్గల్, మే 21 : వర్గల్ వేణుగోపాలస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వేద పండితులు వేదాంతం మురళీధరచార్యుల నేతృత్వంలో అంకురార్పణతో ఈ ఉత్సవాలు మొదలయ్యాయి. వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

కొనసాగుతున్న నృసింహ జయంతి ఉత్సవాలు

వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో నృసింహ జయంతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం మూల మంత్ర హవనములు, పూర్ణహుతి, నివేదనతో పాటు తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో భక్తులతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ తెలిపారు.

కుటుంబ సర్వేను సక్రమంగా నిర్వహించాలి

● స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలితకుమారి

నారాయణఖేడ్, మే 21: స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుటుంబ సర్వేను సక్రమంగా నిర్వహించాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి లలితకుమారి సూచించారు. మంగళవారం ఆమె స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు శ్వేత, వాసవి, రామరాజు, రావణ్‌లతో కలిసి మంగళవారం ఖేడ్ మండలం జుజాల్‌పూర్, మాణిక్‌నాయక్‌తండా, శంకర్‌నాయక్‌తండా, తెట్టెకుంటతండా, జగన్నాథ్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. కుటుంబ సర్వేను తనిఖీ చేసి గర్భిణులు, బాలింతలకు కౌన్సెలింగ్ ఇవ్వడం, బరువు, ఎత్తులను కొలిచే యంత్రాలను తనిఖీ చేసి అంగన్‌వాడీల టీచర్లు, సహాయకులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సీడీపీవో సుజాత, అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశమై కుటుంబ సర్వేకు సంబంధించిన వివరాలు తెలుసుకుని సలహాలు, సూచనలు ఇస్తూ సందేహాలను నివృత్తి చేశారు.



ఖేడ్‌లో ఐసీడీఎస్ అధికారులకు సూచనలిస్తున్న లలితకుమారి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

● ఓబీసీ ఉద్యోగులు సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తాటిపల్లి పాండు

సంగారెడ్డి రూరల్, మే 21: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఓబీసీ ఉద్యోగులు సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగానే వినియోగించుకుంటున్నాయని విమర్శించారు. స్థానిక సంస్థలు సర్పంచ్, జట్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో గతంలో 'ఓట్లు మావి సీట్లు కూడా మావే' అనే నినాదంతో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీరామారావు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లను 18 శాతానికి కుదించిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ యువత అధ్యక్షుడు రమేష్, జిల్లా నాయకులు మల్లయ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ దశాబ్ది వేడుకల క్రికెట్ కప్ విజేత భవానీ టైగర్స్ టీమ్



కప్ అందుకుంటున్న భవానీ టైగర్స్ టీమ్ కెప్టెన్ ప్రశాంత్

బర్కత్‌పుర, మే 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో మూడురోజుల పాటు జరిగిన తెలంగాణ దశాబ్ది వేడుకల క్రికెట్ కప్ పోటీలో విజేతగా భవానీ టైగర్స్ టీమ్ నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా 21 క్రికెట్ జట్లు ఈ పోటీలో పాల్గొన్నాయని ఫైనల్ పోటీలో భవానీ టైగర్స్ టీమ్ ఆర్‌వీఎల్ఎల్ఎస్ మెదక్ టీమ్‌పై విజయం సాధించిందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీ.సంగమేశ్వర్, గౌరవాధ్యక్షుడు వెన్నె ఈశ్వరప్పలు తెలిపారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో కప్‌ను భవానీ టైగర్స్ టీమ్ కెప్టెన్ ప్రశాంత్ అందుకున్నారని వారు తెలిపారు. క్రీడలను ప్రోత్సహించడానికి తమ సంఘం ఆధ్వర్యంలో క్రికెట్‌తోపాటు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశామన్నారు. సంఘం మహిళా అధ్యక్షురాలు శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల సరఫరాలో ప్రభుత్వం విఫలం

● మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

జోగిపేట, మే 21: పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ విత్తనాల సరిపడా సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అబద్ధపు హామీలతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదనడానికి జోగిపేటలో ఈరోజు జరిగిన విత్తనాల సరఫరానే నిదర్శనమన్నారు. ఎన్నికల ముందు కాకమ్మ కబుర్లు చెప్పిన ప్రభుత్వం తీరా గెలిచాక, రైతులను విస్మరిస్తోందన్నారు. రైతుబంధుకు ఎగనామం పెట్టి, రుణమాఫీని మరిచిన కాంగ్రెస్ సర్కార్.. రూ.500 బోనస్‌ను తుంగలో తొక్కిందని చెప్పారు. దీనికితోడు, ప్రభుత్వం తాజాగా విత్తనాల సరఫరాలోనూ రైతులను ఇబ్బంది పెడుతుందని పేర్కొన్నారు. ఇది రైతుల పట్ల కాంగ్రెస్ సర్కార్‌కు ఉన్న పక్షపాత ధోరణికి నిదర్శనమన్నారు. అయితే, బీఆర్ఎస్ పార్టీగా, మాజీ ఎమ్మెల్యేగా తాము ఎప్పుడూ రైతుల పక్షాన ఉంటామని ఆయన స్పష్టం చేశారు.

రేణుకా ఎల్లమ్మ తల్లికి బోనాలు

మునిపల్లి, మే 21: మండల కేంద్రమైన మునిపల్లిలో మంగళవారం రేణుకా ఎల్లమ్మతల్లికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను ఎత్తుకుని గ్రామ పుర వీధుల గుండా డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

● రైతులు ఆందోళన చెందవద్దు
● ఆర్కియాలజీశాఖ కమిషనర్, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతిహోళికేరి



తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లి కొనుగోలు కేంద్రంలో మాయిశ్చర్‌ను పరిశీలిస్తున్న భారతిహోళికేరి

తూప్రాన్, మే 21: తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందొద్దని ఆర్కియాలజీశాఖ కమిషనర్, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతిహోళికేరి పేర్కొన్నారు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లి, మల్కాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆమె పరిశీలించి రైతులతో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కేంద్రాల్లో ఉన్న ధాన్యం రవాణా చేసేందుకు అవసరమైన లారీలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గుండ్రెడ్డిపల్లిలో ఐదులారీలు, మల్కాపూర్‌లో రెండు లారీలు అవసరమని చెప్పగా ఏర్పాటు చేసి ధాన్యం తరలించాలని సూచించారు. భారతిహోళికేరి వెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, తహసీల్దార్ విజయలక్ష్మి, ఐకేపీ ఏపీఎం రుక్మిణీ ఉన్నారు. ఇదిలా ఉండగా.. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీలను ఏర్పాటు చేసేందుకు అధికారులు మంగళవారం రోడ్డెక్కారు. తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ రోడ్డులో రవాణాశాఖ అధికారి శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో లారీలను సమకూర్చే పనులు చేపట్టారు. రోడ్డున వెళ్లే ఖాళీ లారీలను నిలిపి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పంపించారు.

నిలువ ఉన్న ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలి

చేగుంట, మే 21: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిలువ ఉన్న ధాన్యాన్ని త్వరగా రైస్ మిల్లులకు తరలించాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతిహోళికేరి అధికారులను ఆదేశించారు. మంగళవారం నార్సింగి మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు, కేంద్రాల వివరాలను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని షేర్‌పల్లి, నర్సంపల్లి, నర్సంపల్లి పెద్దతండా, జప్తి శివనూర్, సంకాపూర్, వల్లూరు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పూర్తిగా తరలించామని తెలిపారు. ఆరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్ర నిర్వహణకురాలుగా పనిచేసిన సీసీ సుల్తానాను, అధికారుల పనితీరును ఆమె అభినందించారు. నార్సింగి కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యం బస్తాలు మాత్రమే ఉన్నాయని, వాటిని త్వరలో తరలించే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు.



చేగుంట: నార్సింగిలోని కొనుగోలు కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న భారతిహోళికేరీ

తహసీల్దార్ కార్యాలయ సందర్శన

చేగుంట తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మంగళవారం సందర్శించారు. మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని కొనుగోలు కేంద్రాల వద్ద నిలువ ఉన్న ధాన్యాన్ని రెండు, మూడురోజుల్లో రైస్ మిల్లులకు తరలించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, నార్సింగి, చేగుంట తహసీల్దార్లు ఖరీమ్, గియ వున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ చివరిదశకు చేరింది

దుబ్బాక, మే 21: జిల్లాలో ధాన్యం సేకరణ చివరి దశకు చేరిందనీ, కొనుగోలు చేసిన రెండు, మూడురోజుల్లోనే ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లోకి చేరుతున్నాయని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతిహోళికేరి అన్నారు. మంగళవారం దుబ్బాక మండలం హబ్షీపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం కొనుగోలును రెండు, మూడురోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్డీవో పీడీ జయదేవ్ హర్యా, జిల్లా పౌరసరఫరాల అధికారి హరీశ్, డీఎస్‌వో తనూజ ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

సిద్దిపేట అగ్రికల్చర్, మే 21: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఉమ్మడి జిల్లాల ప్రత్యేకాధికారి భారతిహోళికేరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ మనుచౌదరి, సంబంధిత అధికారులతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదిరోజుల్లో మొత్తం ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు, ఇంకా రావాల్సిన ధాన్యంపై జిల్లా వ్యవసాయ అధికారి పూర్తి నివేదిక సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ డీఆర్డీఏ జయదేవ్‌ఆర్యా తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి

● డబ్బుల కోసం కుమారుడే చంపాడని అనుమానం



వృద్ధురాలి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు

కొండాపూర్, మే 21: కొండాపూర్‌కు చెందిన 75 ఏళ్ల వృద్ధురాలు అనుమానాస్పదంగా చనిపోగా, ఆస్తి అమ్మిన డబ్బులు తనకు ఇవ్వడం లేదన్న కోపంతో ఓ కుమారుడు తల్లిని చంపినట్లు అనుమానిస్తున్నారు. కొండాపూర్ ఎస్ఐ హరికుమార్ కథనం ప్రకారం.. మారెపల్లి గ్రామానికి చందిన గంజాయి రత్నమ్మ మంగళవారం తన ఇంట్లోనే అనుమానాస్పదంగా చనిపోయి ఉంది. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా, చాలా ఏళ్ల క్రితమే ఓ కుమారుడు, కుమార్తె చనిపోయారు. అయితే, గంజాయి రత్నమ్మ తన పేరిట ఉన్న 20 గుంటల భూమిని ఎనిమిది నెలల క్రితం అమ్మేసింది. ఆ డబ్బులను కుమార్తెకు ఇచ్చింది. అప్పటి నుంచి ఆమె కుమారుడు సామేల్ తరచూ తల్లితో డబ్బుల కోసం గొడవ పడుతుండేవాడు. ఆ సమయంలో రత్నమ్మ తనకు కొడుకు, కూతురు ఇద్దరూ సమానమేనని సర్దిచెప్పేంది. అయితే, మంగళవారం ఇంట్లో ఆమె విగతజీవిగా పడి ఉండటంతో డబ్బుల కోసమే కొడుకు ఆమెను చంపినట్లు గ్రామంలో జరిపిన విచారణలో పలువురు చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

నైపుణ్యాభివృద్ధికి 'టాటా' సహకారం

● రాష్ట్రవ్యాప్తంగా 65 ఐటీఐలతో ఒప్పందం
● త్వరలోనే సంగారెడ్డి ఐటీఐలో శిక్షణ ప్రారంభం

సంగారెడ్డి అర్బన్, మే 21: విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు 'టాటా' సంస్థ ముందుకొచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా 65 ఐటీఐ కళాశాలల్లో 'టాటా' సంస్థ సహకారంతో కొత్త కోర్సులపై శిక్షణ ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా సంగారెడ్డిలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి సహకరించాలని 'టాటా' సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఐటీఐ కళాశాల వర్గాలు మంగళవారం తెలిపాయి. ఈ కళాశాలలో 13 రకాల ట్రేడ్‌లలో 340 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మరిన్ని కోర్సులను పరిచయం చేసేందుకు కంప్యూటర్ న్యూమరికల్స్ కంట్రోల్(సీఎన్‌సీ) మిషన్స్ ఏర్పాటు చేయాలని, శిక్షణకు సంబంధించి కళాశాల ప్రాంగణంలో ఓ భవనాన్ని నిర్మించేందుకు టాటా సంస్థ కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ఇప్పటికే స్థల పరిశీలన కూడా పూర్తయిందని, భవన నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలిక భవనాల్లోనే శిక్షణ ప్రారంభిస్తామని కళాశాల వర్గాలు తెలిపాయి. వచ్చే నెలలో కొత్త కోర్సుల్లో శిక్షణ ప్రారంభించే అవకాశాలున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ కె.రాజేశ్వర్‌రావు తెలిపారు.

ప్రతి ఒక్కరూ మంచి క్రీడాకారులుగా ఎదగాలి

● సైబర్ క్రైమ్స్ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి
● ముగిసిన క్రికెట్ వేసవి శిక్షణా శిబిరం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సైబర్ క్రైమ్స్ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, మే 21: ప్రతి ఒక్కరూ మంచి క్రీడాకారులుగా ఎదగాలని సైబర్ క్రైమ్స్ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి ఆకాంక్షించారు. సంగారెడ్డిలోని ఎంఎస్ అకాడమీలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నేతృత్వంలో ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు నిర్వహించిన వేసవి క్రికెట్ శిక్షణా శిబిరం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. శారీరక దృఢత్వం పెరిగేలా ప్రతి ఒక్కరూ సాధన చేయాలని సూచించారు. ఎక్కడైతే క్రికెట్ అసోసియేషన్ బలంగా ఉంటుందో అక్కడ మంచి క్రీడాకారులు తయారయ్యే అవకాశం ఉంటుందన్నారు. లేనిచోట క్రీడాకారులకు సరైన వసతులు, సౌకర్యాలుండవన్నారు. చదువుతో పాటు ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలని, క్రీడలు దినచర్యలో భాగమని సూచించారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కాగా మంగళవారం ఎంఎస్ అకాడమీలో అండర్-25, టీ-20 జట్టుకు జరిగిన ఉమ్మడి జిల్లా క్రికెట్ ఎంపికలకు 16 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 24న హైదరాబాద్‌లో జరిగే టీ-20 టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు కూనవేణు, ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రాజేందర్‌రెడ్డి, కోచ్ శ్రీనాథ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, చంద్రమౌళి, ఇనాం, రియాజ్, మధుమోహన్, తోహిద్, జితేందర్‌రెడ్డి, ధారాసింగ్, విజయ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నాదే

● సిట్టింగ్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ ధీమా



చౌకూర్‌లో ఎల్లమ్మ మాత ఆలయ వార్షికోత్సవానికి హాజరైన జహీరాబాద్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్

పుల్‌కల్, మే 21: జహీరాబాద్ పార్లమెంట్‌లో తానే గెలుపొందుతానని, ఇందులో ఎలాంటి అనుమానం లేదని సిట్టింగ్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ ధీమా వ్యక్తం చేశారు. చౌటకూర్ మండలం కేంద్రంలో కొనసాగుతున్న రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలకు మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హవా కొనసాగుతుందని, ఆయనను ప్రజలు మూడోసారి ప్రధాని చేయాలన్న సంకల్పంతో స్వచ్ఛందంగా ఓట్లు వేశారని తెలిపారు. దేశ ప్రధానిగా ఎవరు ఉండాలో ప్రజలు ఎప్పుడో తేల్చారని, ప్రతిపక్షాలకు డిపాజిట్లు కూడా దక్కవన్నారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఐదు విడతలుగా పార్లమెంట్ ఎన్నికలు ముగిశాయని, ఈ నెల 25న ఆరో విడత, జూన్ 1న ఏడవ విడత ఎన్నికల పూర్తి కానున్నాయన్నారు. నరేంద్రమోదీకి స్పష్టమైన తీర్పునిచ్చారని, 400కు పైగానే పార్లమెంట్ స్థానాలు రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఓటింగ్ సరళిలో స్పష్టమైన ఆధిక్యతను చాటామని, గెలుపుపై తమకు ఎలాంటి అనుమానం లేదన్నారు. ఎన్నడూ లేనంతగా దక్షిణ భారతంలో మోదీ హవా కొనసాగిందని, సర్వేలు కూడా అదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. తెలంగాణలో పదికిపైగా స్థానాల్లో జయకేతనం ఎగురవేస్తామని ఎంపీ బీబీ పాటిల్ పేర్కొన్నారు. 2019లో వచ్చిన సీట్లకంటే అదనంగా సీట్లలో పాగా వేయడం ఖాయంగా కనిపిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోగా, ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావుకులకర్ణి, బీజేపీ మండలాధ్యక్షుడు నీరుడి ప్రవీణ్‌కుమార్ ముదిరాజ్, నాయకులు రమేశ్ బస్వరాజ్ పాటిల్, పలువట్ల జగదీశ్వర్, సార రాజ్‌కుమార్, పల్లె ప్రభుకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ బీజేపీదే

● పార్లమెంట్ అభివృద్ధి కోసం కృషి
● బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు
● కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, మే 21: తెలంగాణలో భవిష్యత్ బీజేపీదేనని మెదక్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో పాపన్నపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీకి చెందిన దాదాపు 100 మంది బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించి మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీని మరోసారి ప్రధానిని చేయాలనే కాంక్షతో అన్నివర్గాల ప్రజలు ఈ ఎన్నికల్లో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. బీజేపీ బలపరిచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. మోదీ పదేళ్ల పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. అన్ని గ్రామాల్లోని యువకులు సంఘటితమై మోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ పార్టీలో చేరినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎంపీగా విజయం సాధించిన తర్వాత మీలో ఒకడిగా పార్లమెంట్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్, మండలాధ్యక్షులు రాములు, ప్రభాకర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల బారినపడకుండా అవగాహన కల్పించాలి

● సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్



తూప్రాన్ సబ్‌డివిజన్ కార్యాలయంలో శిక్షణలో పాల్గొన్న సైబర్ వారియర్స్, సిబ్బంది

తూప్రాన్, మే 21: సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా అవగాహన కల్పిస్తూ బాధ్యతగా మెలగాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్ సూచించారు. మంగళవారం తూప్రాన్ సబ్ డివిజన్ కార్యాలయంలో జూన్ 8న మెగా లోక్ అదాలత్ ఉన్నందున సైబర్ నేరాల పరిష్కారానికి అవగాహనా సదస్సు నిర్వహించారు. ఇంటర్నెట్ ఆధారంగా జరిగే వ్యక్తిగత, ఆర్థిక, భద్రతపరమైన నేరాలను సైబర్ నేరాలు అంటారని వివరించారు. ఇంటర్నెట్ మాధ్యమం ద్వారా ప్రైవసీని భగ్నం చేయడం, బ్యాంకు ఖాతాలను ఖాళీ చేయడం, భద్రతకు ముప్పు కలిగించడం వంటి నేరాలకు సైబర్ నేరగాళ్లు చేస్తున్నారని పేర్కొన్నారు. రోజువారి కార్యక్రమాలు అన్ని ఆన్‌లైన్ ద్వారా నిర్వహించడం వల్ల నేరాల సంఖ్య కూడా పెరిగిందన్నారు. సాధారణంగా ప్రజలు ఆశ, భయం వల్ల సైబర్ నేరాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. బాధితులు పోగొట్టుకున్న డబ్బులను వారికి తిరిగి ఎలా రీఫండ్ చేయాలి..? అనుమితి బ్యాంకు స్టేట్‌మెంట్లను ఎలా సేకరించాలి? బాధితులు పోగొట్టుకున్న డబ్బులు పొందేందుకు ఎలా ఫిర్యాదు చేయాలి..? ఏపే ఆంశాలను, పత్రాలను జతచేసి ఇవ్వాలని అనే అంశంపై సైబర్ వారియర్స్, సిబ్బందికి వివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐలు, సైబర్ వారియర్ సిబ్బంది పాల్గొన్నారు.

24న మామిడిపండ్ల వేలం పాట



సంగారెడ్డి జిల్లా జైలు ఆవరణలో ఉన్న మామిడిచెట్లు

కంది, మే 21: కంది పరిధిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలు ఆవరణలో ఉన్న మామిడిచెట్లకు కాసిన పండ్లకు ఈనెల 24న ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు జైలు సూపరింటెండెంట్ దండా భరత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జైలు ఆవరణలో ఎలాంటి రసాయనాలు వాడకుండా సేంద్రియ ఎరువులతో పండించిన మామిడిపండ్లలో దసేరి, బంగినపల్లి, పెద్దరసాలు లాంటి వివిధ రకాల పండ్లు ఉన్నాయన్నారు. జైళ్లశాఖ డీఐజీ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగే ఈ వేలంలో వ్యాపారస్తులు రూ.5 వేలు డిపాజిట్ చేసి పాల్గొనాలని భరత్‌రెడ్డి కోరారు.

ఆధునిక పరిజ్ఞానంతో పండ్లను సాగు చేయాలి

● కొండా లక్ష్మణ్ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డి.నీరజాప్రభాకర్
● ఎఫ్ఆర్ఎస్‌లో 265 రకాల మామిడి పండ్లు



సంగారెడ్డిలోని ఫల పరిశోధనా కేంద్రంలో ప్రదర్శనలో ఉంచిన మామిడి పండ్లను పరిశీలిస్తున్న కొండా లక్ష్మణ్ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ నీరజాప్రభాకర్



ప్రదర్శనలో కుళ్లిన మామిడి పండ్లు

సంగారెడ్డి రూరల్, మే 21: రైతులు ఆధునిక పరిజ్ఞానంతో మామిడి పండ్లను సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కొండా లక్ష్మణ్ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డి.నీరజాప్రభాకర్ అన్నారు. సంగారెడ్డిలోని ఫల పరిశోధనా కేంద్రంలో మంగళవారం మామిడిపండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ సంగారెడ్డిలో గల ఎఫ్ఆర్ఎస్‌లో 265 రకాల మామిడి పండ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మామిడిపండ్లను సాగుచేసే సమయంలో రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులతో సాగుచేస్తే నాణ్యమైన పండ్లు వస్తాయని, పండ్ల కోతల సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మామిడి పండ్లన ఎండబెట్టి ఆమ్‌చూర్‌ని ఎఫ్ఆర్ఎస్‌లో 1994 నుంచి 1999 వరకు తయారు చేశారని గుర్తుచేశారు. కాలం మారిన కొద్దీ వివిధరకాలుగా రుచికరంగా ఆమ్‌చూర్‌ని తయారు చేస్తున్నారన్నారు. సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో అనేక రకాల మామిడిపండ్లను సాగుచేస్తూ ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారని తెలిపారు. రైతులు మామిడి పండ్లను సాగుచేసేందుకు ముందుకు రావాలని నీరజాప్రభాకర్ కోరారు. ఇదిలా ఉండగా ఎఫ్ఆర్ఎస్‌లో నిర్వహించిన మామిడిపండ్ల ప్రదర్శనలో అధికారులు, సిబ్బంది తప్ప ఎవరినీ ఆహ్వానించలేదని, సమాచారం లేక ఇద్దరు ముగ్గురు రైతులు మాత్రమే హాజరయ్యారు. ఎఫ్ఆర్ఎస్ అధికారులు రైతు సంఘాల నాయకులు, ప్రజలకు సమాచారం ఇవ్వకుండానే ప్రదర్శనను ఏర్పాటు చేశారనే విమర్శలు ఉన్నాయి.

ప్రదర్శనలో కుళ్లిన మామిడిపండ్లు

సంగారెడ్డిలోని ఫల పరిశోధనా కేంద్రంలో ఎంతో ఆర్భాటంగా ఏర్పాటుచేసిన మామిడి పండ్ల ప్రదర్శనలో కుళ్లిన పండ్లు దర్శనమిచ్చాయి. ప్రదర్శనకు వచ్చిన వారు కుళ్లిన పండ్లను చూసి ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. ఇదే విషయాన్ని అక్కడే ఉన్న ఎఫ్ఆర్ఎస్ అధికారులను అడగగా పొరపాటున వచ్చాయని వాటిని ప్రదర్శనలో నుంచి తీసివేశారు. ఈ కార్యక్రమంలో ఫల పరిశోధన శాస్త్రవేత్తలు డా.కిరణ్‌కుమార్, డా.హరికాంత్, డా. మాధవి, డా.మౌనిక, డి.నితీష్, ఉద్యానవన శాఖ అధికారి సమత, రైతులు తదితరులు పాల్గొన్నారు.



వివిధ రకాల మామిడి పండ్లతో ఎఫ్ఆర్ఎస్ మహిళా అధికారులు

ఐదేళ్ల కష్టాన్ని అడ్డంగా నరికారు

● నిరసన వ్యక్తం చేసిన ఉపాధి కూలీలు



చెట్లను తొలగించడంతో రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న కూలీలు

కొండాపూర్, మే 20: ఐదేళ్ల నుంచి మొక్కలు నాటి సంరక్షణ కోసం చుట్టూ కంచె వేసి పెంచిన చెట్లను అడ్డంగా నరకడాన్ని నిరసిస్తూ ఉపాధి కూలీలు మల్కాపూర్ నుంచి మైతాబ్‌ఖాన్‌గూడ వెళ్లే ప్రధాన రహదారిపై మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. మొక్కలను రక్షిస్తూ ఉపాధి పొందుతున్న తమకు గుర్తింపు లేకుండా చేశారని వాపోయారు. ఈ విషయమై గొల్లపల్లి పంచాయతీ కార్యదర్శి నౌషద్ ఫాతిమాను వివరణ కోరగా.. పంచాయతీ అనుమతి లేకుండానే చెట్లను తొలగించారని సమాధానమిచ్చారు. విద్యుత్‌లో అంతరాయం ఉండొద్దని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే చెట్లను తొలగించామని కొండాపూర్ విద్యుత్ ఏఈ సిద్దిరాజ్ పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత: డీఎల్పీవో

నిజాంపేట, మే 21: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని డీఎల్పీవో సతీష్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని నందిగామ గ్రామాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులతో పాటు గ్రామపంచాయతీలోని ఆస్తుల వివరాలు పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలోని హరితహార నర్సరీ, పల్లె ప్రకృతివనం, తెలంగాణ క్రీడా ప్రాంగణం, వైకుంఠధామం, డంపింగ్‌యార్డ్‌లను పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో పరిసరాలను పపరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని తెలిపారు. అనంతరం గ్రామపంచాయతీ పల్లె ప్రగతి పనుల పట్ల సంతృప్తి వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆరిఫ్ హుస్సేన్, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి

● కాంగ్రెస్ నాయకులు

గజ్వేల్, మే 21: రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని నర్సారెడ్డి నివాసంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనవెంట మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు మద్దూరి మల్లారెడ్డి, పట్టణాధ్యక్షుడు మోహన్నగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, సయ్యద్ మతీన్, మైనారిటీ విభాగం జిల్లా మాజీ అధ్యక్షుడు మహ్మద్ సమీర్, నాయకులు సుభాష్ చంద్రబోస్, రామచంద్రాచారి, రాజ్‌కుమార్, జంగం రమేశ్‌గౌడ్, రాజుగౌడ్, క్యాసారం బాబ, మామిడి కృష్ణ, గుండు లక్ష్మీనారాయణ, అంజాద్, అహజర్, జహీర్, సురేశ్, క్యాసారం మల్లారెడ్డి, శ్రావణ్ ఉన్నారు.

● **కోహెడ:** కోహెడలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, మాజీ సర్పంచులు కర్ర రవీందర్, దొమ్మాట జగన్‌రెడ్డి, పిల్లి రాజయ్య, శెట్టి సుధాకర్, కనకయ్య, మల్లారెడ్డి, నారాయణగౌడ్, మాజీ ఎంపీటీసీ బండారి బాలరాజు, జయరాజు, బైరి సుధాకర్, బందెల బాలకిషన్, అబ్దుల్ రఫీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **అక్కన్నపేట:** మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, పట్టణ అధ్యక్షుడు చింతల మల్లారెడ్డి, మాజీ సర్పంచులు బద్ధం రాజిరెడ్డి, బొడ్డు ఈశ్వర్, కిసాన్ సెల్ అధ్యక్షుడు కొత్తకొండ పోశెట్టి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ అక్బర్ పాషా, మాజీ ఎంపీటీసీ భాస్కర్ నాయక్, సింగిల్ విండో వైస్ చైర్మన్ భూపతి ముకుందరెడ్డి, నాయకులు పీరెల్లి లింగమూర్తి, ఉల్లెంగల రాజు పాల్గొన్నారు.

● **చేర్యాల:** మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని చేర్యాల పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు మంచాల చిరంజీవులు, మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, కౌన్సిలర్ ఆడెపు నరేందర్, మల్లన్న ఆలయ మాజీ చైర్మన్లు ముస్త్యాల కిష్టయ్య ఆడెపు చంద్రయ్య, నాయకులు పుర్మ ఆగంరెడ్డి, భూమిగారి మనోహర్, పాల లక్ష్మీనారాయణ, మామిడాల నాగరాజు, నీలం సన్నీ, దాసరి శ్రీకాంత్, పోతుగంటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. రాజీవ్ గాంధీ 33వ వర్ధంతిని కొమురవెల్లి మండలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కొమురవెల్లి మండలాధక్షుడు మహదేవుని శ్రీనివాస్, యూత్‌కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్, నాయకులు సనాది భాస్కర్, లింగంపల్లి కనకరాజు, జంగని రవి, పబ్బోజు రాములు చారి, ఎక్కలదేవి శ్రీనివాస్, శ్రీనాథ్‌రెడ్డి, సార్ల లింగం, స్వాములపల్లి రమేశ్, చంద్రం, నర్సింహులు, ప్రవీణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

● **బెజ్జంకి:** రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **కొండపాక:** మండలంలోని వెలికట్ట క్రాస్‌రోడ్ వద్ద కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాసరి లింగరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొయ్యడ వెంకటేష్, మండల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బట్ట పరశురాములు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము మల్లికార్జున్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ మెరుగు ప్రభాస్, పీఏసీఎస్ డైరెక్టర్ బూరుగుల సురేందర్‌రావు, సీనియర్ నాయకులు పంజా చిరంజీవి, వెలకట్ట గ్రామ అధ్యక్షుడు పెరుగు తిరుపతి, బురుగుల నరేందర్ రావు, సిద్దులు పాల్గొన్నారు.

● **హుస్నాబాద్ టౌన్:** హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, యాదవరెడ్డి, కౌన్సిలర్లు వల్లపు రాజు, వెన్న రాజు, కుమార్, మెతుకు కొమురయ్య, పూదరి శ్రీనివాస్, దండి కొమురయ్య తదితరులున్నారు.

● **వర్గల్:** వర్గల్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సందీప్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మహేందర్ గౌడ్, మాజీ ఎంపీపీ మోహన్, తాజా మాజీ సర్పంచ్ తూంకుంట గోపాల్‌రెడ్డి, నాయకులు నందు, నర్సారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాంచేంద్రం, గణేశ్‌చారి పాల్గొన్నారు.

● **దుబ్బాక:** దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వనరేష్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతి మచ్చశ్రీనివాస్ ఉన్నారు.


గజ్వేల్: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నర్సారెడ్డి


కోహెడ: మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


అక్కన్నపేట: రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


చేర్యాల: రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


బెజ్జంకి: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


కొండపాక: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


హుస్నాబాద్ టౌన్: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


వర్గల్: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


దుబ్బాక: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కమలాయపల్లిలో జోరుగా ఇసుక అక్రమదందా


కమలాయపల్లి శివారులో ఇసుక డంపు

చేర్యాల, మే 21: చేర్యాల మండలంలోని కమలాయపల్లిలో ఇసుక అక్రమ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా, గ్రామశివారులోని చెరువులో నుంచి తవ్వకం చేస్తూ సహజ సంపదను కొల్లగొడుతున్నారు. ముందస్తుగా వ్యవసాయబావుల వద్ద డంప్‌లు చేసి రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా సమీప గ్రామాల గుండా దుద్దెడ, సిద్దిపేట, చేర్యాల తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక్కోట్రాక్టర్ ట్రిప్పుకు రూ.6-8వేలు చొప్పున విక్రయిస్తూ, అక్రమదందా కొనసాగిస్తున్నా పట్టించుకోకపోవడంతో రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొద్దిరోజులక్రితం పోలీసులు పలు ట్రాక్టర్లను పట్టుకుని చేతులు దులుపుకోవడంతో అక్రమార్కులు దందాను యథావిధిగా కొనసాగిస్తున్నారు. ఆయా శాఖల అధికారులకు నెలవారీ మామూళ్లు చెల్లించి అక్రమదందా కొనసాగిస్తున్నామంటూ పలువురు బహిరంగంగా పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఇసుక అక్రమదందాపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లను వెంటనే చేపట్టాలి

● బీజేపీ నాయకులు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దౌల్తాబాద్, మే 21: కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు సత్యనారాయణ, బీజేపీ మండలాధ్యక్షుడు సర్వగారి భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసి, మొలకెత్తిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు. వర్షాకాలం దగ్గర పడుతుండడంతో రైతులు భయందోళనకు గురవుతున్నారని, ధాన్యం కొనుగోలు త్వతరగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా ఉపాధ్యాక్షుడు నర్సింహరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కురమ గణేష్,ఓబీసీ మండలాధ్యక్షుడు తుమ్మల గణేష్, బీజేపీ సీనీయర్ నాయకులు ముత్యాల శ్రీనివాస్, బోరింగ్ శ్రీనివాస్, చిక్కుడు స్వామి, పోచయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని బీజేపీ రణభేరి దీక్ష

హుస్నాబాద్ టౌన్, మే 21: రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని ఓ గార్డెన్‌లో బీజేపీ నాయకులు రణభేరి దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సమస్యల పరిష్కారంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు నాలుగు రోజులుగా వివిధ రూపాల్లో కార్యక్రమాలు చేస్తున్నామని వెల్లడించారు. ఇందులో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు లక్కిరెడ్డి తిరుమల, బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, మండలాల అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, మహేందర్‌రెడ్డి, ఖమ్మం వెంకటేశం, పైడిపల్లి శ్రీనివాస్, పృధ్వీరాజ్, విద్యాసాగర్, నాయకులు లక్ష్మన్, సంతోష్, అనంతస్వామి తదితరులున్నారు.

అన్ని రకాల పంటలకు బోనస్ ఇవ్వాలి: సీపీఎం

బెజ్జంకి, మే 21: రైతులు పండించిన అన్ని రకాల పంటలకు బోనస్ ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందుకు వరి ధాన్యానికి 500 బోనస్ ఇస్తామని చెప్పిందని, ఇప్పుడేమో సన్న వడ్లకు మాత్రమే ఇస్తామని అనడం సమంజసం కాదన్నారు. గతంలో కేసీఆర్ సన్న వరి వేయాలని రైతులకు సూచించడంతో సన్న రకం వరి వేసి రైతులు నిండా మునిగారని పేర్కొన్నారు. ఇప్పుడు ఈ ప్రభుత్వం కూడా అదే ఆలోచనతో ముందుకు వెళతూ, రైతులను ముంచేందుకు చూస్తుందన్నారు. కేరళలో ప్రభుత్వం అన్ని రకాల పంటలకు బోనస్ ఇస్తున్నదని, కేరళ మాదిరిగా పండించిన ధాన్యానికి బోనస్ ఇవ్వాలని కోరారు.

డంపింగ్ యార్డును పరిశీలించిన కమిషనర్


డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కమిషనర్

గజ్వేల్, మే 21: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డును మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య మంగళవారం పరిశీలించారు. డంపింగ్‌యార్డులో బయోమైనింగ్ విధానంలో రీసైక్లింగ్ చేసే పొడి వనరులను, కంపోస్టు ఎరువు తయారీని పరిశీలించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి మునిసిపాలిటీ సిబ్బందికి అందజేయాలని కోరారు. ఆయనవెంట మునిసిపల్ ఏఈఈ కిష్టన్న, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ ఉన్నారు.

'కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు బలం'

గజ్వేల్, మే 21: కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు బలమని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన కుమ్మరి కనకయ్య, కుమ్మరి భాస్కర్‌లకు బీఆర్‌ఎస్ సభ్యత్వం ద్వారా మంజూరైన చెక్కులను వారి కుటుంబసభ్యులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలే పార్టీకి బలమని, పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు, వారి కుటుంబాలకు అండగా ఉండాలన్న లక్ష్యంతోనే బీమా చేయించినట్లు తెలిపారు. వారితో జడ్పీటీసీ పంగ మల్లేశం, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, తాజా మాజీ సర్పంచులు మాచాపురం శివయ్య, మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, గొడుగు స్వామి, మద్ది రాజిరెడ్డి, పండరి రవీందర్‌రావు, రఘుపతిరెడ్డి, నాతాని అశోక్‌రావు, పాల రమేశ్‌గౌడ్, రాము, బాల్‌నర్సయ్య, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.

సైబర్ మోసాలపై అవగాహన అవసరం

● ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్

దౌల్తాబాద్, మే 21: సైబర్ నేరాలపై ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తి అవగాహన కలిగి ఉండి, అప్రమత్తతో తగు జాతగ్రత్తలు తీసుకోవాలని దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ అన్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో మంగళవారం సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రజలు తమ వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు.

'సమస్యలు పరిష్కరించాలి'

గజ్వేల్, మే 21: మల్లన్నసాగర్ భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలను గత ప్రభుత్వం ప్రాజెక్టు పేరుతో గ్రామాలను ఖాళీ చేయించిందని, ఇచ్చిన హామీలు, రావాల్సిన నష్టపరిహారం, ప్యాకేజీ, ప్లాట్లను ఇవ్వకుండానే తాత్కాలిక గృహాలకు తరలించారన్నారు. వారి త్యాగానికి ఫలితాన్ని ఉపాధి కల్పించాలని కోరారు.

కరపత్రం ఆవిష్కరణ

గజ్వేల్, మే 21: గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరువుకట్టపై గల శ్రీకార్యసిద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో జయంతి మహోత్సవాలను జూన్ 1న అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి విఠా సాయికృష్ణశర్మ తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని ఆలయంలో మంగళవారం జయంతి మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.

మండలాలకు చేరిన స్కూల్ యూనిఫామ్స్

సిద్దిపేట క్రైం,మే21: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కేటాయించిన ఏకరూప దుస్తులు మంగళవారం మండలాలకు చేరాయి. అమ్మా ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న అత్యవసర పనులను సమగ్ర శిక్షణ స్టేట్ ప్రాజెక్టు అడిషనల్ డైరెక్టర్ రమేష్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, కో ఆర్డినేటర్‌లు రామస్వామి, రంగనాథ్, డీఆర్డీఏ, అధికారులు, వివిధ గ్రామాల ఏపీఎంలు ఉన్నారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి రిమాండ్

సిద్దిపేట క్రైం, మే 21 : పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లాకు చెందిన సంపంగి నవీన్ అనే వ్యక్తి కరీంనగర్ జిల్లా రేణిగుంట వాగులో దొంగతనంగా తన లారీలో ఇసుక తీసుకువచ్చి సిద్దిపేటలో విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 9వ తేదీన టీఎస్ 36 టీపీ 5229 నెంబర్ గల తన లారీలో అక్రమంగా తీసుకువచ్చి ఇసుకను నర్సాపూర్ చౌరస్తాలో అమ్ముకోవడానికి వచ్చాడు. అక్కడ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ లారీని ఆపి ఇసుక గురించి అడగగా వివరాలు చెప్పకుండా కానిస్టేబుల్‌ను నెట్టివేసి లారీతో ఉడాయించారు. అతడనికి అదే రోజు పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

తీన్మార్ మల్లన్న తరఫున ప్రచారం


దూళిమిట్ట: కూటిగల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నాగపురి కిరణ్ కుమార్ గౌడ్, కార్యకర్తలు

దూళిమిట్ట/చేర్యాల, మే 21: వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సే ఎన్నకల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతుగా గురువారం మండలంలోని కూటిగల్‌లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తీన్మార్ మల్లన్నకు పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు బండి క్రిష్ణ, కమలాకర్‌గౌడ్, జితేందర్, రాజేష్, సుధాకర్, బాలరాజు, తిరుపతి, పాండు, నవీన్ పాల్గొన్నారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరుతూ, కాంగ్రెస్ నాయకులు మంగళవారం కొమురవెల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు లింగంపల్లి కనకరాజు, నాయకులు సార్ల లింగం, పబ్బోజు రాములుచారి, ఎక్కలదేవి శ్రీనివాస్, జంగని రవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో విజేతగా ప్రణవి


గోల్డ్, సిల్వర్ మెడల్స్ అందుకుంటున్న ప్రణవి

మద్దూర్, మే 21: మండలంలోని రేబర్తికి చెందిన బట్టర ప్రణవి షోటోకాన్ కరాటే, ఫైరింగ్ విభాగంలో జాతీయస్థాయిలో విజేతగా నిలిచి గోల్డ్, సిల్వర్ మెడల్స్ సొంతం చేసుకుంది. గ్రామానికి చెందిన బట్టర వెంకటేష్ కుమార్తె ప్రణవి హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నది. ఈ నెల 19న గోవాలో యూనివర్సల్ 369 షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా కరాటే చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో జాతీయస్థాయిలో విజేతగా నిలిచింది. ఫైరింగ్ విభాగంలో గోల్డ్, కటాస్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన ప్రణవిని హీరో సుమన్‌తో పాటు పలువురు కరాటే మాస్టర్లు అభినందించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కోహెడ, మే 21: కోహెడ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు జరగనున్నట్లు ఎంపీడీవో కృష్ణయ్య తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ కొక్కుల కీర్తి అధ్యక్షతన జరిగే సమావేశానికి సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

జీలుగ విత్తనాలకు రైతుల పడిగాపులు

మద్దూరు, మే 21: మద్దూరు మండల కేంద్రంతో పాటు మర్మాముల గ్రామాల్లోని రైతు ఆగ్రోస్ సేవా కేంద్రాల దగ్గర జీలుగ విత్తనాల కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. మండలానికి 70 క్వింటాళ్ల జీలుగ విత్తనాలకు రైతు ఆగ్రోస్ సేవా కేంద్రాల ఆధ్వర్యంలో డీడీలు కట్టించినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. జీలుగ విత్తనాల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయాధికారి బి. రామకృష్ణ అన్నారు. డిమాండ్‌ను బట్టి మరో 50 క్వింటాళ్ల జీలుగ విత్తనాలకు ఇండెంట్ పెట్టి తెప్పించనున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఏఈవోల వద్ద ఆధార్, పట్టా పాసుపుస్తకం జిరాక్స్‌తో వచ్చి ఆన్‌లైన్ ఎంట్రీ చేసుకుని టోకెన్ పొందాలని సూచించారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు

గజ్వేల్, మే 21: మార్కెట్‌లో డిమాండ్ ఉన్న విత్తనాలకు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని గజ్వేల్ వ్యవసాయశాఖ ఏడీ బాబునాయక్ హెచ్చరించారు. గజ్వేల్ పట్టణంలోని రైతువేదికలో మంగళవారం గజ్వేల్, కొండపాక, రాయపోల్ మండలాల్లోని సీడ్స్, ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వానాకాలం పంటలకు సంబంధించిన విత్తనాలు, ఫర్టిలైజర్స్ కోసం ప్రణాళికలు అందుబాటులో ఉంచామన్నారు. వారితో వ్యవసాయశాఖ గజ్వేల్ అధికారి గుండు నాగరాజు, కొండపాక వ్యవసాధికారి ప్రియదర్శిని, ఏఈవోలు, డీలర్లు ఉన్నారు.


గజ్వేల్: మాట్లాడుతున్న ఏడీ బాబునాయక్

అందుబాటులో జనుము జీలుగ విత్తనాలు

జగదేవ్‌పూర్, మే 21: మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లోని డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రంలో పచ్చిరొట్ట ఎరువుల జీలుగ జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని జగదేవ్‌పూర్ మండల వ్యవసాయ అధికారి వసంతరావు తెలిపారు. మండలంలో 27000 పాకెట్ల పత్తి విత్తనాలు, 450 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు.

పెసర్లు, వరి విత్తనాలూ..

చేర్యాల, మే 21: చేర్యాల మండల రైతులకు పెసర్లు, ఆర్ఎన్ఆర్, కేఎన్ఎం రకం వరివిత్తనాలు అందుబాటులో ఉన్నాయని చేర్యాల వ్యవసాయాధికారి అఫ్రోజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కనులపండువగా రేణుకా ఎలమ్మ కల్యాణం

దూళిమిట్ట, మే 21: మండల కేంద్రంలో గౌడసంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మతల్లి జమదగ్ని కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు వివిధ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వరదరాజుల స్వామి కల్యాణం

మర్కుక్, మే 21: మండలంలోని వరదరాజ్ గ్రామంలో రెండో కంచిగా విరాజిల్లుతున్న వరదరాజుల స్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం భూనీళా సమేత వరదరాజుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గోపాలకృష్ణ, తాజా మాజీ సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, మండల కోఆప్షన్ సభ్యులు అక్కాల సాహెరా నరేష్, డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దూళిమిట్టలో బోనాలతో ఆలయానికి తరలివస్తున్న మహిళలు


హుస్నాబాద్: ఆలయంలో సహస్రనామ పారాయణం చేస్తున్న మహిళలు

ఆలయ వార్షికోత్సవం

హుస్నాబాద్, మే 21 : హుస్నాబాద్ పట్టణంలోని సంతోషిమాతా ఆలయ 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి లలిత సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి అశోక్, గౌరిశెట్టి ప్రకాశ్, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, కవ్వ వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు.

యోగా శిక్షణ శిబిరానికి అనూహ్య స్పందన

● ఆసక్తి కనబరుస్తున్న ప్రజలు

● చిన్నాపెద్దా భేదం లేకుండా అభ్యాసం

చేర్యాల, మే 21: చేర్యాలలో కొనసాగుతున్న యోగా వేసవి శిబిరానికి అనూహ్య స్పందన లభిస్తున్నది. వేసవి సెలవుల దృష్ట్యా ప్రతి ఒక్కరిలోనూ ఆరోగ్యంపట్ల అవగాహన కల్పించాలన్న సదుద్దేశంతో, యోగా గురువు బి. నర్సింగరావు చేర్యాల పట్టణంలోని ప్రగతి విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో ఉచిత యోగా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నాడు. వృత్తి రీత్యా చేర్యాల సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్న నర్సింగరావు ఆంధ్ర యూనివర్సిటీలో యోగా పీజీ డిప్లమా పూర్తి చేశాడు. వేసవి కాలంలో చిన్నా, పెద్దలు అందుబాటులో ఉండనుండటంతో ఉచిత శిబిరాన్ని ఏర్పాటు చేశాడు.



ఆసనాలు వేస్తున్న చిన్నారులు

నిత్యం 50 మంది..

శిబిరానికి నిత్యం 50మందిపైగా పురుషులు, మహిళలతో పాటు బాలబాలికలు హాజరవుతున్నారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 7-30 గంటల వరకు యోగా నేర్పిస్తున్నారు. జూన్ 8వ తేదీ వరకు ఈ శిబిరాన్ని కొనసాగించనుండటంతో ఔత్సాహికుల సంఖ్య మరింతపెరిగే అవకాశం ఉంది. ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు యోగామ్యాట్స్ సమకూర్చారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుంది. సమయం ఎంతో విలువైంది. ప్రస్తుత గజిబిజీ ప్రపంచంలో చాలా మంది ఒత్తిడికిలోనై ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం లేదు. వేసవి సెలవులు వృథాకానివ్వకుండా ఆరోగ్యంపట్ల అవగాహన కల్పించడం కోసం ఉచిత శిక్షణా శిబిరం ఏర్పాటు చేశాను.

- బి.నర్సింగరావు, యోగా గురు

నిత్యం యోగాసనాలు వేస్తాను



దైనందిన జీవితంలో మానసిక ప్రశాంతతో పాటు ఆరోగ్యంగా ఉండడానికి యోగా దోహదపడుతుంది. నేను నా కుటుంబసభ్యులతో కలిసి శిక్షణ శిబిరానికి నిత్యం వస్తున్నాను. యోగా గురు నర్సింగరావు చెబుతున్న ఆసనాలను ఆసక్తితో నేర్చుకుంటున్నాం. శిబిరానికి పరిమితం కాకుండా ప్రతీ రోజూ కొంతసమయం కేటాయించి ఇంట్లో కూడా ఆసనాలు వేస్తాం.

- రామారావు

శిక్షణ చాలా బాగా అనిపిస్తున్నది



యోగా శిబిరానికి నేను నా తల్లి దండ్రులతో కలిసి వెళుతున్నాను. అక్కడికి వచ్చిన చిన్నపిల్లలతో కలిసి ఆసనాలు వేస్తుంటే చాలాబాగా అనిపిస్తున్నది.

- ఈశ్వరిత


ఫార్మసిస్టు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సుస్తి

సిద్దిపేట రూరల్ మండలం చింతమడక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. దీంతో ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి 10:30 గంటల వరకు స్వీపర్ తప్పా వైద్య సిబ్బంది ఎవరూ రాలేదరు. గంటన్నర ఆలస్యంగా డాక్టర్, స్టాఫ్ నర్సు విధులకు హాజరయ్యారు. హెచ్ఈవో చింతమడక, నారాయణరావుపేట రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తుండగా, ఫార్మసిస్టు సెలవులో ఉన్నట్లు సిబ్బంది తెలిపారు.

- సిద్దిపేట రూరల్